www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 30 మే 2024



నేడు సిఐటియు ఆవిర్భావ దినోత్సవం




ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జయప్రదం చేయాలని, జిల్లాలోని అన్ని సిఐటియు కార్యాలయాల వద్ద జెండాను ఆవిష్కరించాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి పిలుపునిచ్చారు. 1970, మే 30న కలకత్తాలో ఆవిర్భవించిన సిఐటియు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులకు, స్కీం వర్కర్లకు అండగా ఉందన్నారు. సరళీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ సంస్థలను కాపాడుతోందన్నారు. నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించిందని, రైతుల మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేపట్టిందన్నారు.

ఫిట్‌నెస్ చె(చి)త్తశుద్ధి..!





ప్రజాశక్తి - తిరుపతి

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు స్కూలు ఫీజుతో పాటు బస్సు ఫీజునూ భారీగా వసూలు చేస్తున్నాయి. డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగినందుకు ఆ మేరకు బస్సు ఫీజులను భారీగా పెంచేశాయి. ఒక్కో విద్యార్థి నుంచి రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఛార్జీలను వసూలు చేస్తున్నాయి. అయితే ఛార్జీలకు తగినట్లుగా భద్రత కల్పించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్కూల్ బస్సు డ్రైవర్ల ఎంపికలోనూ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. శిక్షణ పొంది, ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్లకు ఎక్కువ వేతనం చెల్లించాలన్న కారణంగా 60 ఏళు నిండిన వారిని డ్రైవర్లుగా ఎంపిక చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తుండటం గమనార్హం.

సాధారణంగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభానికి నెల రోజుల ముందే బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. అయినా ఇప్పటి వరకు చాలా విద్యా సంస్థల యాజమాన్యాలు బస్సులకు పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ చేయించు కోకుండా తాత్సారం చేస్తున్నాయి. అయినప్పటికీ ఆర్టీఏ అధికారులు సైతం స్కూలు బస్సులపై కొరఢా ఝుళిపించకపోవడం శోచనీయం.

పాఠశాలలు జూన్ 13న పున్ణప్రారంభం కానున్నాయి. సెలవుల్లోనూ అడ్మిషన్లు శర వేగంగా పూర్తి చేస్తున్న పాఠశాల యాజమాన్యాలు బస్సు ఫీజులనూ గంపగుత్తగా వసూలు చేస్తున్నాయి. అయితే బస్సుల్లో 25 నుంచి 40 వరకు సీటింగ్ సామర్థ్యం ఉండగా 40 నుంచి 60 మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పెద్ద మొత్తంలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లకు ఆటోలలోనూ పంపిస్తారు. వాటిల్లో కూడా డ్రైవర్లు పరిమితికి మించి 10 నుంచి 15 మంది విద్యార్థులను తీసుకువెళతారు. ఆటో ముందు భాగంలో, రెండు వైపులా పదుల సంఖ్యలో స్కూలు బ్యాగులను వేలాడదీసి తీసుకువెళుతున్నారు. అయినా ఆర్టీఏ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఇవీ నిబంధనలు

మోటారు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రశీదు, పొల్యూషన్, కంట్రోల్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలి. డ్రైవర్ ఫొటోను తప్పనిసరిగా బస్సులో ఏర్పాటు చేయాలి. అద్దాలకు గ్రిల్స్ అమర్చాలి. డ్రైవర్‌కు 60 ఏండ్లు మించరాదు. ప్రతి బస్సులో విద్యార్థులకు అటెండెంట్ ఉండాలి. ప్రతి నెల స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదు. బస్సులకు తప్పనిసరిగా పసుపు రంగు వేయాలి. పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నెంబర్, పూర్తి చిరునామా బస్సు ఎడమవైపు కనిపించేలా ఉండాలి, డ్రైవర్లు మూణ్ణెళ్లకోసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి. బస్సు కిటికీలకు మధ్య రెండు లోహపు కడ్డీలు అమర్చి ఉండాలి.

కాలం చెల్లినవే ఎక్కువ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2,450 స్కూల్ బస్సులు ఉన్నాయి. చిత్తూరు ప్రాంతీయ రవాణ శాఖ పరిధిలో 1,121 స్కూల్ బస్సులు, తిరుపతి పరిధిలో 1,329 వరకు బస్సులున్నాయి. గతేడాది ఎఫ్సీ పత్రాలు తీసుకున్న బస్సులకు ఈ నెల ఆఖరుకి గడువు ముగియనుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇవి రోడ్లపైకి రావడానికి వీల్లేదు. అలాగే 15 ఏళ్లు దాటిన స్కూల్ బస్సులు విద్యార్థులను ఎక్కించుకోవడానికి వీల్లేదని నిబంధనలు చెబుతున్నాయి. పాఠశాలల పున్ణప్రారంభానికి నెల రోజుల ముందు నుంచే విద్యాసంస్థల నిర్వాహకులు వాహనాలను కండీషన్లో ఉంచుకుని, రిపేర్లు పూర్తి చేసి రవాణ శాఖ నుంచి మరో ఏడాది చెల్లుబాటుకు ఎఫ్సీ తీసుకోవాలి. కానీ ఇప్పటి వరకు 200లకు పైగా బస్సులకూ ఎఫ్‌సి లు చేయలేదని తెలుస్తోంది. నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయాల్సిన అధికారులు మౌనంగా ఉండటం శోచనీయం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 శాతం విద్యాసంస్థలు కాలం చెల్లిన బస్సులకు పైపై మెరుగులు దిద్ది నడుపుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి ఆరోపిస్తున్నారు. దాదాపు 15 ఏళ్లుదాటిన వాటికే ఎక్స్‌టెన్షన్ తీసుకుని నడుపుతున్నట్లు వాపోతున్నారు. చాలా పాఠశాలలు విద్యార్థుల రవాణాకు వాడుతున్న బస్సులను సెకండ్‌హ్యాండ్‌లో తక్కువ ధరకు కొన్నవేనని, వీటిలో ఎక్కువ చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాల నుంచి తెచ్చినవి ఎక్కువ ఉన్నట్లు చెబుతుండటం గమనార్హం.



జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తూ...

ఉద్యమ నిర్మాత జక్కా వెంకయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఉద్యమ నిర్మాత జక్కా వెంకయ్య ఆరో వర్ధంతిని గూడూరు సిపిఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు టి.వెంకట రామిరెడ్డి జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జోగి శివకుమార్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా దామరమడుగు గ్రామంలో 1930లో నవంబర్ 3న జన్మించారని, 2018, మే 29న అనారోగ్యంతో మృతిచెందారన్నారు. 1953లో దామరమడుగులో జరిగిన పోరాటానికి జక్కా వెంకయ్య నాయకత్వం వహించారన్నారు. నెల్లూరు జిల్లాలో జరిగిన భూపోరాటాలు, కూలి, రైతాంగ ఉద్యమ పోరాటాలు, 1993లో సారా వ్యతిరేక పోరాటం, సాక్షరతా ఉద్యమం, 1992 లో ఆక్వా రైతుల, కార్మిక ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. ఉద్యమాలకు ముందు నిలబడి నడిపించిన మహా వ్యక్తి అని కొనియాడారు. 1985, 1994లో రెండు దఫాలు అల్లూరు శాసనసభ్యులుగా ఉన్నారన్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలకు తర్ఫీదు ఇచ్చేందుకు సులభమైన శైలిలో అనేక క్లాసులు బోధించి ప్రజా సేవకులుగా వారిని తీర్చిదిద్దారని తెలిపారు. యువత ఆయన ఆశయాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పామంజి మణి, సిఐటియు నాయకులు బి.వి. రమణయ్య, యస్.సురేష్, ఆర్.శ్రీనివాసులు, అడపాలప్రసాద్, బి.నారాయణ, వెంకట్రావు, బి.చంద్రయ్య, పుట్టాశంకరయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

చెన్నైస్ అమిర్తలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ కోర్స్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నుండి చెన్నైస్ అమిర్తలో ఇంటర్నేషనల్ ఏవియేషన్ సర్టిఫికెట్ డిప్లమా, డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆ సంస్థ చైర్మన్ ఆర్. భూమి నాదం ఓ ప్రకటనలో తెలిపారు. ఏవియేషన్ కోర్సు అమలు కోసం మలేషియాకు చెందిన ప్రముఖ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్‌తో ఈ నెల 17న తమిళనాడులో ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. గత 14 ఏళ్లుగా చెన్నై నగరం ప్రధాన కేంద్రంగా బెంగళూరు, హైదరాబాద్, ఖైరతాబాద్, విజయవాడలో ఉన్న బ్రాంచీలలో వేలాదిమంది విద్యార్థులకు అత్యంత నాణ్యతతో కూడిన హోటల్ మేనేజ్మెంట్, హాస్పిటాలిటీ కోర్సులను బోధిస్తున్నామన్నారు. నూతన సాంకేతిక ఆవిష్కరణలతో విద్యార్థులకు వైమానిక రంగ విద్యను అందించడానికి సంకల్పించామన్నారు. తమ విద్యాసంస్థలో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందాలని సంతోషం వ్యక్తం చేశారు. 27 ఏళ్ల ఎమిరేట్స్ ఇంటర్నేషనల్ సలోన్ క్యూలినేర్ చరిత్రలో భారత్ తొలిసారిగా ఈ బంగారు పతకాన్ని గెలుచుకుందన్నారు.

'అంకుర'లో ఐదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గ్విలియన్ బార్రే సింగ్రోంతో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారికి అంకుర ఉమెన్స్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకష్ణ తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్ లోని అంకుర ఆసుపత్రిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాళహస్తికి చెందిన నాలుగు సంవత్సరాల 8 నెలల బాలుడు మాట్లాడలేకపోతున్నాడు, నడవలేకపోతున్నాడు, ఏమి తినలేక పోతున్నాడు అంటూ తల్లిదండ్రులు అంకుర వైద్యులను సంప్రదించారన్నారు. ఆ బాలుని పరీక్షించిన వైద్యులు బాలుడు జిపిఎస్‌తో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. క్రిటికల్ కండిషన్ లో ఉన్న బాలుని మల్టీ డిసిప్లినరీ టీం ప్రముఖ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రవి చంద్ర ఆధ్వర్యంలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారన్నారు. ఐదేళ్ల బాలుడికి శ్వాస, ఆక్సిజన్ థెరపితో ఏడు రోజులపాటు మెకానికల్ వెంటిలేషన్ ద్వారా వైద్యం అందించారని తెలిపారు. రెండు వారాలు వైద్యుల సంరక్షణ తర్వాత అతనిని డిశ్చార్జ్ చేశామని వెల్లడించారు. ప్రస్తుతం ఆ బాలుడు ఆరోగ్యవంతుడిగా ఉన్నారని, అంకుర ఆసుపత్రుల్లో ఎంతో నైపుణ్యం కలిగిన ప్రముఖ పీడియాట్రిక్స్ వైద్యులు ఉండటంవల్లనే ఇలాంటి క్లిష్టమైన వ్యాధులకు సైతం విజయవంతంగా చికిత్సలు అందించగలుగుతున్నామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ దినేష్ రెడ్డి, డాక్టర్ పద్వి, డాక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి ఎన్జీవోస్ కాలనీ పార్క్ వద్ద జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తిరుపతి డిఎస్పి రవి మనోహర్ ఆచారి తెలిపారు. స్థానిక అలిపిరి పోలీస్ స్టేషన్లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఎన్.వెంకట శివారెడ్డి ఈనెల 25వ తేదీ ఉదయం 6.30 గంటలకు మోటార్ సైకిల్ పై వెళుతూ ఉంటే, అతని వెనక నుంచి ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్ పై వచ్చి మొద్దు కత్తితో తలపైన కొట్టి హత్యప్రయత్నం చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారన్నారు. శివారెడ్డి పై హత్యాయత్నానికి పాల్పడిన గిరీష్ చంద్రారెడ్డి, శ్రీలక్ష్మి, కే రమేష్, కేశవను అదుపులోకి తీసుకున్నామన్నారు. బాధితుడు ఎన్.వెంకట శివారెడ్డికి అదే అపార్ట్మెంట్ తన ఇంటి ఎదురుగా ఫ్లాట్ నెం: 502 లో నివాసం ఉంటున్న తిప్పన గిరీష్ చంద్రారెడ్డి కి గత కొద్దిరోజులుగా గొడవలు ఉన్నాయి. చంద్రారెడ్డి చీటింగ్ కేసులలో ముద్దాయి అయినందున తనకి అప్పు ఇచ్చినవారు తరుచు తన ఇంటికి వచ్చి, తను లేకపోవడంతో ఎదురు ఇంట్లో ఉన్న వెంకట శివారెడ్డి ని అడిగేవారు. వారికి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వండి అని సలహా ఇస్తున్నాడని శివారెడ్డి పై చంద్రారెడ్డి కక్ష పెంచుకున్నాడు. చంద్ర రెడ్డి అతని భార్య శ్రీలక్ష్మి కలసి అతనిని చంపాలనే ఉద్దేశంతో రమేష్, కేశవన్ తో చేతులు కలిపి వారికీ డబ్బులు ఇచ్చి వెంకట శివా రెడ్డిని చంపమన్నారు. కేశవన్ వద్ద ఉన్న అతని బావమరిది సాయి గణేశ్, బాలాజి అను వ్యక్తులు మోటార్ సైకిల్ పై వచ్చి మొద్దు కత్తితో వెంకట శివారెడ్డి తలపైన కొట్టి హత్యప్రయత్నం చేసి, పారిపోయారన్నారు. అలిపిరి పోలీసులు నిఘా ఉంచి ఈ హత్యా ప్రయత్నం కేసులో ముద్దాయిలను ఈ నెల 28వ తేది మధ్యాహ్నం అలిపిరి బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 3 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించమన్నారు. నిందితుల అరెస్టుకు సహకరించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో అలిపిరి సిఐ రామారావు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులను చూపిస్తున్న డిఎస్‌పి రవి మనోహర్ ఆచారి


నేడు తిరుమలకు హోంమంత్రి అమిత్‌షా

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి దర్శనార్థం గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తిరుమలకు రానున్నారు. తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి నుంచి ప్రత్యేక విమానంలో గురువారం సాయంత్రం 6.15గంటలకు విచ్చేస్తారు. రోడ్డుమార్గంలో 7.20 గంటలకు తిరుమల చేరుకుంటారు. వకుళమాత నిలయం అతిథిగృహంలో బస చేస్తారు. శుక్రవారం ఉదయం 8.25 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. అమిత్‌షా పర్యటన సందర్భంగా తిరుమల తిరుపతిలో అర్బన్ ఎస్‌పి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు.

నేడు 'అనంత భావజాలికుడు చంద్రబాబు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



గురువారం ఉదయం హోటల్ సింధూరి పార్క్‌లో 'చంద్రబాబు అనంత భావజాలికుడు' పుస్తకా విష్కరణ జరుగుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరా సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రేరా మాజీ చైర్మన్ డాక్టర్ వెలమాటి రామనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ బి సుధాకర రెడ్డి పుస్తక సమీక్ష చేస్తారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి. భాను ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఎం. సుగుణమ్మ, టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు జి . నరసింహ యాదవ్, పారిశ్రామికవేత్త వెంకయ్య, పుస్తక రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ పాల్గొంటారు.



విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు

సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో ఆదివారం విద్యుత్ షాక్ గురై దళితవాడకు చెందిన కప తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడు గృహ నిర్మాణంలో భాగంగా ఇంటిపై నీటితో గోడలను తడుపుతుండగా అనుకోకుండా ఇంటిపై పోతున్న 11కెవి విద్యుత్ తీగలు తగిలి కిందపడి, గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు. 11కెవి విద్యుత్ తీగలను వేరేచోటకు మార్చాలని అనేకమార్లు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడం వల్లనే కృప కుటుంబానికి ఇబ్బంది ఏర్పడిందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్‌శాఖ అధికారులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సిపిఎం మండల కార్యదర్శి మెలుగు రమేష్ తెలిపారు. ఈటిపాకం గ్రామంలోని దళితవాడకు చెందిన పవిత్రకు గతంలో గాయాలయ్యాయని పేర్కొన్నారు. ఎఇ, డిఇలకు అనేకమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లనే దళితులు విద్యుత్ షాక్‌కు గురవుతున్నారని తెలిపారు. దళితవాడలు కావడం వల్లనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

అన్నమయ్య గొప్ప సామాజికవేత్త : భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్

భగవంతుని దష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజికవేత్త అని శ్వేత సంచాలకులు భూమన సుబ్రహ్మణ్యంరెడ్డి చెప్పారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ "అన్నమయ్య – సామాజికత" అనే అంశంపై ఉపన్యసించారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో అన్ని వత్తుల వారు సమానమేనని, రాజు – పేద తేడాలు ఉండకూడదని, అందరికీ శ్రీహరే అంతరాత్మ అని అన్నమయ్య తెలియజేశారని చెప్పారు. ఆశ్రమధర్మాల్లో గహస్తాశ్రమ గొప్పదనాన్ని సంకీర్తన ద్వారా తెలియజేశారన్నారు. పలు సంకీర్తనల్లో రాయలసీమ మండలికానికి పెద్దపీట వేశారని చెప్పారు. అన్నమయ్య కీర్తనలను చదివినా, విన్నా వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని తెలిపారు. ఈ విషయాలను సాధారణ ప్రజలకు సైతం అర్థమయ్యేలా అన్నమయ్య సంకీర్తనలు రచించారని వివరించారు. అత్యంత



సంస్కారవంతంగా శృంగార సంకీర్తనలు రచించి భక్తి భావాన్ని వ్యాప్తి చేశారని తెలియజేశారు. అన్యమతాలకు చెందిన ప్రభువులు, రాజులు తిరుమల సందర్శించినప్పుడు స్వామివారికి సమర్పించిన కానుకలను తిరుమల కొండపై ఇప్పటికీ చూడవచ్చన్నారు.

తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయం అకాడమిక్ అడ్వైజర్ ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి "అన్నమయ్య – జానపదం" అనే అంశంపై మాట్లాడుతూ భారతీయ ఆత్మ జానపదంలో ఉందని తెలిపారు. అన్నమయ్య ఆనాటి జనజీవనాన్ని తన సంకీర్తనల్లో ప్రతిబింబ చేశారన్నారు. అన్నమాచార్య సంకీర్తనలు భావితరాలకు ఉపయుక్తంగా ఉంటాయని, సంస్కతి – సంప్రదాయాలు, ఆనాటి జానపద గేయాలు, జాతీయాలు, మండలికాలు, సామెతలు, పురాణ గాథలను అన్నమయ్య తన సంకీర్తన ద్వారా తెలియజేశారని వివరించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ యువశ్రీ "అన్నమయ్య – శ్రీకృష్ణతత్త్వం" అనే అంశంపై ప్రసంగించారు. శరణాగతి, లోకనీతి, వేదాల్లోని సారాన్ని కలిపి అన్నమయ్య తన సాహిత్యాన్ని సష్టించారని చెప్పారు. యావత్ భక్తి సాహిత్యంలో అన్నమయ్యకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. అన్ని మంత్రాల సారం శ్రీ వేంకటేశ్వర మంత్రంలో ఉందంటూ స్వామివారిపై ఎనలేని భక్తిని చాటారన్నారు. అన్నమయ్య జీవిత విశేషాలను పరిశీలిస్తే తెలుగునాట భాగవత శిఖామణులుగా, భాగవతోత్తములుగా గుర్తింపు పొందారని చెప్పారు. ఆయన కీర్తనలలో సామాన్య ప్రజలను చైతన్యవంతం చేసేలా, భక్తిభావాన్ని పెంచేలా ఉన్నాయన్నారు. అన్నమయ్య సంకీర్తనల్లో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, హనుమంతుడు తదితర దేవతలకు ప్రాధాన్యం కల్పించారని వివరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా. విభీషణ శర్మ, వక్తలను శాలువ, శ్రీవారి తీర్థప్రసాదాలతో సన్మానించారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

కౌంటింగ్ దష్ట్యా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చంద్రగిరి పోలీసులు బుధవారం సమస్యాత్మక గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. చంద్రగిరి సబ్ డివిజన్, చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పనపాకం, కల్ రోడ్ పల్లి, కాశి పెంట్ల, ఎం. కొంగర వారి పల్లి, ముంగిలిపట్టు, ఎం. కొత్తపల్లి గ్రామాలలో సీఐ రామయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ను చేపట్టారు. స్థానికులతో సమావేశమై జూన్ 4 వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్ తో పాటు, 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ, పోలీస్ వారికి సహకరించాలని కోరారు.



1.6 రేట్లు వృద్ధిని సాధించిన ఫ్లిప్‌కార్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దేశంలోనే ఈ మార్కెటింగ్ లో ప్రాముఖ్యత ఉన్న ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ 1.6 శాతం వృద్ధిని సాధించిందని ఆ సంస్థ హెడ్, ఉపాధ్యక్షులు హరికుమార్ తెలిపారు. ఓ ప్రైవేట్ హోటల్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రముఖ నగరాలైన బెంగళూరు, చెన్నై, కలకత్తా, ముంబై, న్యూఢిల్లీ వంటి మెట్రో నగరాలతో పాటు అనంతపూర్, బెరహంపూర్, గోరఖ్పూర్, మొహరదాబాద్, నాగోల్, సహర్స, షిమోగా, వేలూరు వంటి ఇతర పట్టణాలతో సహా దేశంలోని 200 నగరాలకు డెలివరీ అందిస్తున్న ఏకైక ఈ కామర్స్ ప్లేయర్ ఫ్లిప్కార్ట్ గ్రోసరీ అని తెలిపారు. అగ్రశ్రేణి ఉత్పత్తులలో నూనె, ఆట ప్యాక్ చేసిన ఆహారంతో పాటుగా టీ కాఫీ వ్యక్తిగత సంరక్షణ వంటి ఎఫ్ఎంసి వస్తువులు ఉన్నాయన్నారు. తమ వస్తువుల డెలివరీలో 50 శాతానికి పైగా ఎలక్ట్రిక్ వాహనాలనే వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహాయపడుతున్నామని వెల్లడించారు.

ఈవిఎం స్ట్రాంగ్‌రూముల్లో 24X7 భద్రత



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఎన్నికల ఈవిఎంలు భద్రపరచిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూం భద్రత ఏర్పాట్లు, కౌంటింగ్ ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ బుధవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. 24×7 భద్రత ఉంటుందన్నారు. సీసీటీవీ కెమెరాల కంట్రోల్ రూం నుండి ఈవిఎం లను పరిశీలించారు. సందర్శకుల రిజిష్టర్ నందు సంతకాలు చేశారు.వీరి వెంట చంద్రగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిషాంత్ రెడ్డి ఉన్నారు.

తుమ్మలగుంటలో గంగమ్మ జాతర వేడుకలు

ప్రజాశక్తి -రామచంద్రపురం (తిరుపతి రూరల్)

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో గంగ జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అమ్మవారి ప్రతిమను తయారుచేసి నడి వీధిన ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో కొలువు దీర్చిన గంగమ్మ ప్రతిమలకు భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా సారెను తీసుకుని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు గంగమ్మకు సారెను సమర్పించారు. ఆ తర్వాత అమ్మవారి ప్రతిమను ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 25 వేల విలువగల 4.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డీఎస్పీ రవి మనోహర్ ఆచారి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద కొందరి వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం రావడంతో అలిపిరి సిఐ రామారావు సిబ్బందితో దాడి చేసి ముగ్గురిని అదుపులో తీసుకున్నారన్నారు. గంజాయి తరలిస్తున్న వారు సంజయ్ గాంధీ కాలనీకి చెందిన ఎస్ శ్రీనివాసులు రావు, కొరమేను గుంటకు చెందిన ఎం. జయచంద్ర, చెన్నారెడ్డి కాలనీకి చెందిన ఐ. సోమనాథ్ అలియాస్ సోముగా గుర్తించాం అన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులకోసం పై అధికారులకు ప్రతిపాదనలు పంపుతాం అన్నారు. ఈ సమావేశంలో అలిపిరి సిఐ, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో సమస్యల పరిష్కారంపై చర్చిస్తున్న దృశ్యం

మండల సమావేశంలో సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గురవ య్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల సర్వ సభ్య సాధారణ సమావేశంలో పలు శాఖల అధికారులు, ఎంపిటీసీలు, సర్పంచులు పలు సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి శ్రీనివాసులు రెడ్డి, ఇంద్రాణి, ఎంపీడీవో రాజశేఖర్, ఎంఈవో కాంచన, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చిందేపల్లిలో అగ్నిగుండ మహోత్సవం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం చిందేపల్లి హరిజనవాడలో రుక్మిణి సమేత పాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవం సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి విచ్చేసి దర్శనం చేసుకుని అనంతరం గ్రామస్తులతో కలిసి కోలాట భజనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల వైస్ ఎంపిపి జమ్మల శ్రీనివాస్ యాదవ్, వైసిపి నాయకులు, సుమన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, చెంచు రెడ్డి, మునికుమార్, దర్శ మధు, గణపయ్య, గిరి, వెంకటయ్య పాల్గొన్నారు.


కనుమూరి చంద్రబాబునాయుడు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పులివర్తి నాని

చిన్నబ్బ నాయుడుని పరామర్శించిన నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం నారావారిపల్లికి చెందిన నారా చంద్రబాబు నాయుడు బంధువు, టిడిపి నాయకుడు చిన్నబ్బ నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మండల నాయకులతో కలసి బుధవారం ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు.

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బావమరిది కనుమూరి చంద్రబాబు నాయుడు 25వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం కందులవారి పల్లిలోని స్వగృహంలో ఆయన చిత్ర పటానికి పులివర్తి నాని నివాళులు అర్పిం చారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు చరిత, దిలీప్ కుమార్‌లను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు వి సుబ్రహ్మణ్యం నాయుడు, ఎస్ గౌస్ బాషా, ప్రతాప్ నాయుడు, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

గంగ జాతరలో బియ్యపు పవిత్ర రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్:

ఏర్పేడు మండలంలోని సరస్వతి కండ్రిగలో గంగ జాతర సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి బుధవారం విచ్చేసి గంగమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి, రమణయ్య యాదవ్, ఎంపీపీ శ్రీనివాసులు యాదవ్, జనార్ధన్ యాదవ్, సర్పంచ్ అయోధ్య, మైరావయ్య, చంద్ర, సుబ్రమ ణ్యం యాదవ్, హేమంత్, రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రామ్ బత్తి యాదవ్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి మజ్దూర్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పట్టణంలో ఏపీఎస్ ఆర్‌టిసి విశ్రాంతి ఉద్యోగి, ఆర్‌టిసి మజ్దూరు యూనియన్ మాజీ అధ్యక్షుడు, అయ్యప్ప దేవాలయంలో సభ్యుడుగా భక్తులకు సేవలు అందించిన సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి ఆలయ నిర్వాహకులు, ఏపీఎస్ ఆర్‌టిసి విశ్రాంతి ఉద్యోగులు, యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు.


చందమామల కోటయ్యను సన్మానిస్తున్న దృశ్యం

మహాకూటమి ఉపాధ్యక్షుడిగా కోటయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

రాష్ట్ర యానాది సంక్షేమం మహా కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చందమామల కోటయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ నగర్ లోని యానాది సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కోటయ్యకు శు భాకాంక్షలు తెలుపుతూ ఆ సంఘం నాయకులు సంబరాలు చేసుకున్నారు. కోటయ్యకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం కోటయ్య కూటమి ఉపాధ్యక్షుడిగా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ మొత్తం 34 యానాది సంఘాల కలయికగా ఈ మహా కూటమి ఏర్పడిందన్నారు. యానాదుల సంక్షేమం, వారి అభ్యున్నతే లక్ష్యంగా కూటమి పోరాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూటమి లక్ష్యాల కోసం పాటు పడాలని పిలుపు నిచ్చారు. ఈ ప్రమాణ స్వీకారంలో ఏ రవీంద్ర, గాజుల రత్న, టీ మారయ్య, చంగల్ రాయలు, భాస్కర్, సోమయ్య, నాగమ్మ, స్వాతి మణెమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.

మరుగు దొడ్లకు మరుగేది?

-మరమ్మతులకు నోచుకోని తలుపులు..మహిళల ఇబ్బంది - ఇది సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్‌లో దుస్థితి

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ మరుగుదొడ్లకు మరుగు కరువైంది. దీంతో మహిళా ప్రయాణికులు మూత్ర విసర్జన , బహిర్భూమి కోసం మరుగుదొడ్లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తుతోంది. సత్యవేడు నుంచి ఇటు పుత్తూరు, తిరుపతికి, అటు శ్రీకాళహస్తి, చెన్నైకి వెళ్లడానికి బస్సుల కోసం ఆర్టీసీ బస్టాండ్లో ప్రయాణికులు వేచి ఉంటారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ యాజమాన్యం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో గతంలో మరుగుదొడ్లను నిర్మించింది. పురుషులకు, మహిళల ప్రయాణికుల కోసం రెండు మరుగుదొడ్లను నిర్మించారు. పైగా మరుగుదొడ్లను శుభ్రం చేయడానికి, తగినంత నీటిని అందుబాటులోకి ఉంచుకుని నిర్వహించడానికి ప్రత్యేక ఏజెన్సీ సిబ్బందికి అప్పగించారు. వీరు మరుగుదొడ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి బహిర్భూమి కోసం 10 రూపాయలు, మూత్ర విసర్జన కోసం ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం మరుగుదొడ్లకు తలుపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో పురుషులే గాక మహిళా ప్రయాణికులు కూడా మరుగుదొడ్లకు వెళ్లాలంటే ఇబ్బంది కర పరిస్థితి ఎదురవుతోంది. మరుగుదొడ్లకు దెబ్బతిన్న తలుపులను తొలగించి, వాటి స్థానంలో కొత్త తలుపులు బిగించడంలో సంబంధిత ఆర్‌టిసి అధికారులు నిర్లక్ష్యం చూపడంపై సర్వత్రా విమర్శలు విపిస్తున్నాయి. మరుగుదొడ్ల తలుపులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా సత్యవేడు ఆర్టీసీ డిపో యాజమాన్యం పట్టించుకోక పోవడం విమర్శలకు దారి తీస్తోంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాల్సింది పోయి ఇందుకు భిన్నంగా ఆర్టీసీ అధికారులు వ్యవహరించడం పట్ల పలువురు ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటరమణ దీనిపై స్పందించి మరుగుదొడ్లకు కొత్త తలుపులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మరుగును కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.




ఆర్‌టిసి బస్టాండులో తలుపులు కరువైన మరుగుదొడ్లు

అనుక్షణం అప్రమత్తత అవసరం

- కౌంటింగ్ ఏజెంట్లు నిర్లక్ష్యం వహిస్తే అవకతవకలు
- వైసిపి వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-వెంకటగిరి: ఎన్నికల్లో కీలకఘట్టం ఓట్ల లెక్కింపే అని, కౌంటింగ్ ఏజెంట్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని వైసిపి వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవన్‌లో బుధవారం వైసిపి కౌంటింగ్ ఏజెంట్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి అవకాశమున్న ప్రత్యర్థి పార్టీ పోలింగ్ కేంద్రాల వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనేక అవకతవకలకు పాల్పడే అవకాశం ఉందని నేదురుమల్లి హెచ్చరించారు. గతంలో కొన్ని ఎన్నికల్లో కౌంటింగ్ ఏజెంట్ల నిర్లక్ష్యం వల్ల భారీ మూల్యం చెల్లించుకున్న సందర్భాలు ఉన్నా యన్నారు. ఇలాంటి పరిస్థితి రాకుండా చివరి ఓటు లెక్కించే వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, కౌంటింగ్ సమ యంలో ప్రతి పార్టీకి వచ్చిన ఓట్ల ను చూసి నిర్ధారించుకొని నమో దు చేసుకుని, పోలైన మొత్తం ఓట్లతో సరిచూసు కోవా లని సూ చించారు.


మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వైసిపిదే అధికారం

రాష్ట్రంలో మళ్లీ వైసిపిదే అధికారం అని నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి కౌంటింగ్ ఏజెంట్ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. పోస్ట ల్ బ్యాలెట్లు కౌంటింగ్ సమ యంలో జాగ్రత్తగా వ్యవ హరిం చాలని, ఎన్నికల కమిషన్ నిబం ధనల మేరకు ఆ పోస్టల్ బ్యాలెట్‌లో ఉన్నాయా? లేదా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కౌంటింగ్ జరిగేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అవకతవకలకు పాల్పడాలని చూస్తే అవతలి పార్టీల ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు.

వంట నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: నారాయణవనం మండలంలోని మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు నారాయణవనం ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు హెచ్ ప్రభాకర్ రాజు, కె గోవిందస్వామి మాట్లాడుతూ ఎమ్ డి ఎమ్ నిర్వాహకులు తమ విధులను బాధ్యతగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని విజయవంతం చేసేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు మంచి పోషణ అందుతుందని వంటగదిని శుభ్రం చేసుకోవాలని, వంట పాత్రాలను కిచెన్ హెడ్ ప్రతి పాఠశాలకు చక్కగా ఉందని కిచెన్ గార్డులను పెంచుకుని సేవా భావంతో పనిచేయాలని సూచించారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందించాలన్నారు. ఎంఈఓ గోవిందస్వామి మాట్లాడుతూ ఎమ్‌డిఎమ్ నాణ్యతను పెంచడం ద్వారా విద్యార్థులలో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని తద్వారా ఎన్‌రోల్‌మెంటు ఎక్కువగా నమోదు కావడానికి, చక్కగా చదువుకోవడానికి మధ్యాహ్న భోజనం పథకం ఉపయోగ పడుతుందన్నారు. తమ వంతు బాధ్యతగా తల్లుల పాత్రలో పోషించాల్సింది ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. నాలుగు గ్రూపులుగా తయారుచేసి వారికి కాంపిటేషన్ నిర్వహించారు. శిక్షణకు హాజరైన వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంటి ఆపరేటర్ జయరాం, సీఎంఆర్టి సత్యేంద్ర కుమార్, ఐఇ ఆర్ లు విజయన్ భరత్, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో

విద్య ప్రాముఖ్యతపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఎస్‌ఓఎస్‌ఎఫ్ ఎస్‌పి ఆధ్వర్యంలో ఏర్పేడు ఎస్‌ఓఎస్ కార్యాలయంలో విద్య ప్రాముఖ్యత పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ట్రైబల్ కమ్యూనిటీ గ్రామాలైన అక్కుర్తి ఎస్టి కాలనీ , అబ్బుబట్ల పల్లి, బత్తినయ్య కాలనీ, మెల్లచ్చూరు, ఇతర కమ్యూనిటీ గ్రామాలైన అక్కుర్తి అరుంధతి వాడ, ఎల్లంపల్లి, వాగివేడు, ముద్దమూడి, పంగూరు, ఊరందూరు ఎస్సీ కాలనీ తదితర గ్రామాల నుండి దాదాపు 120 మంది మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ టి లక్ష్మమ్మ విద్య ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత, సామాజిక అభివృద్ధిలో విద్య పోషించే కీలక పాత్రను వివరించారు. విద్య పురోగతికి మూల స్తంభం అని, విద్య ఆవిష్కరణలకు మూలమని, ఆర్థిక అభివృద్ధి సామాజిక ఐక్యత విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. భావి తరాల వారి ఉజ్వల భవిష్యత్తు ను రూపొందిం చడంలో విద్య కీలక పాత్ర పోష స్తుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో షెడ్యూల్డ్ తెగలవారు ఇప్పటికీ విద్యా భ్యాసానికి కొంత దూరంగా ఉన్నారని, వారు రాబోయే రోజులలో తప్పకుండా విద్య ప్రాము ఖ్యతను గుర్తించి వారు చదువు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓఎస్ ఎఫ్ ఎస్‌పి లోకేషన్, ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సిబ్బంది మునిరత్నం, జీనత్, ఆనిమేటర్లు పాల్గొన్నారు.


విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు: వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకుని దోమలు కారణంగా, సీజనల్‌గా వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా వుండి వ్యాధులు రాకుండా చూసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ దివాకర్ పేర్కొన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని లక్ష్మీపురం యానాది కాలనీలో వైద్యాధికారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వచ్చే దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధి, బోధకాలు వ్యాధి ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తాయని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కన్నా రాకుండా చూసుకోవడం మంచిది అన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలవకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం నీటిని ఖాళీ చేసి మళ్లీ పట్టుకోవాలని, ఈ ఫ్రైడే డ్రైడే పాటించడం వల్ల దోమ లార్వాలు నశించిపోయి దోమల బెడద తగ్గుతుం దన్నారు. దోమ తెరలు వాడడం, వేపాకు పొగ వేసుకోవడం ద్వారా దోమల కాటు నుండి రక్షించు కోవ చ్చొన్నారు. ప్రతి ఇంటి వద్ద కుళాయి లకు మూతలు బిగించి నీటిని వృథా కాకుండా చూసు కోవాలని, పైపులు లీకేజీ లేకుండా చూసుకోవాలన్నారు. వీటిపి గ్రామాలలో ఆశ, ఏఎన్ఎంలు పరిశీలించి తగు చర్యలు తీసుకుని సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. శరీర పరిశుభ్రత, చేతులు శుభ్రం చేసుకోవడం, బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేసులు, పంచాయతీ సెక్రటరీ ఇందిరమ్మ, ఏఎన్ఎం, ఆశ వర్కరు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యాధికారి

క్రైం న్యూస్

అడవిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం..


అటవీ ప్రాంతంలో మృతి చెందిన వృద్ధుడు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండలం అలిమేలు మంగాపు రం కమ్మొళ్లమెట్ట అటవీ ప్రాంతం లో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహాన్ని స్థానికులు గుర్తిం చారు. బుధవారం ఉద యం స్థానికులు కొందరు అటవీ ప్రాంతంలో పడి ఉన్న మృతదేహాన్ని గమనించారు. సమాచారాన్ని సంబంధిత వీఆర్‌ఏకు అందించారు. వీఆర్‌ఏ పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుళ్లిపోయి దుర్వాసన రావడంతో వృద్ధుడు మృతి చెంది మూడు, నాలుగు రోజులు అయి ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. మృతుడి వయసు 70 ఏళ్లు ఉంటుం దని తెలిపారు. మృతదేహాన్ని అలిమేలు మంగాపురం పురం పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది అటవీ ప్రాంతంలోనే పూడ్చి వేసి దహన సంస్కారాలు నిర్వహించారు. మృతుడు పలు ప్రాంతాల్లో బిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని స్థానికులు పేర్కొన్నారు.

అన్న దాడి ఘటనలో తమ్ముడు మృతి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఓ వ్యక్తిపై అన్నదమ్ముళ్లు దాడికి దిగిన ఘటనలో తమ్ముడు అన్నను అడ్డుకునే ప్రయత్నం లో చేతిలో కర్ర తలపై తగిలి మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం వెలుగు చూసింది. గూడూ రు రూరల్ పోలీస్‌ల కథనం మేరకు.. గూడూరు మండల పరిధిలోని చెంబడి పాలెంలో నివసిస్తున్న పురిణి మస్తాన య్య, అతని తమ్ముడు అశోక్ లకు అదే గ్రామానికి చెందిన మధుసూదన్ కుమారుడు గురవయ్యకు మధ్య వ్యక్తిగత కారణాలతో ఘర్షణ మొదలైందని, ఈ క్రమంలో మస్తానయ్య, అశోక్ ఇద్దరూ కలిసి గురవయ్య ఇంటికి వెళ్లి గొడవ పడి గురవయ్య తండ్రి మధుసూదన్ పై మస్తానయ్య కర్రతో దాడి చేశాడు. అడ్డుకోబోయిన అశోక్‌కు కర్ర తగడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయ పడిన అశోక్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పొరపాటున అన్న చేతిలో కర్ర సొంత తమ్ముడుకి తగిలి మృతి చెందడంతో ఆ కుటుం బంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాత దొంగ అరెస్ట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాత్రి వేళలో దొంగతనాలకు పాల్పడుతున్న కరుడు గట్టిన పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి సుమారు 8 లక్షలా 50 వేల రూపాయల విలువ కలిగిన 138 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఏఎస్పీ విమల కుమారి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి చుట్టుపక్కల జరుగుతున్న ఇంటి దొంగతనాలపై నిఘా ఉంచి, దొంగలను పట్టుకోవాలని ఎస్‌పి ఆదేశించారని ఈ మేరకు క్రైమ్ పోలీస్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలించారన్నారు. ఈ నేపథ్యంలో అలిపిరిచర్లపల్లి రోడ్డు లోని సైన్స్ సెంటర్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న తిరుపతి నెహ్రూ చెందిన పులి నరేష్ (42) ను అదుపులోకి తీసుకున్నామని, పోలీసుల విచారణలో ఈ నేరస్తుడు తన యుక్త వయసు నుండి తన మిత్రులు కల్లూరి జగదీష్ కుమార్, దాము, జెమిని గణేష్ లతో కలసి గతంలో అనేక దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ కేసులకు ఇతడిని తిరుపతి ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ, గాజుల మండ్యం, శ్రీకాళహస్తి, ముత్యాలరెడ్డి పల్లి, అలిపిరి, రేణిగుంట, పెనుమూరు, రైల్వే కోడూర్, వెదురుకుప్పం, పుత్తూరు, నగరి, రేణిగుంట పోలీసులు అతడిని గతంలో అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి చోరీ సొత్తు రికవరీ చేసి జైలుకు పంపారని తెలిపారు. జైలు నుండి బయటకు వచ్చి మళ్లీ తన ప్రవర్తన మార్చుకోకుండా మూడు నెలలలో తిరుపతి, శ్రీకాళహస్తి చుట్టుపక్కల ప్రాంతాలలో ఆరు ఇంటి దొంగతనాలు చేశాడని, పోలీసులు పక్కా ప్రణాళికతో అతడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఎనిమిది లక్షల 50 వేల రూపాయలు విలువచేసే 138 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ మేరకు నేరస్తుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని తెలిపారు. నిందితుడు అరెస్టు, సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీస్ సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో తిరుపతి క్రైమ్ డిఎస్పి రవికుమార్, సీఐ మురళీకృష్ణ, క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల తోపుడు బండ్ల స్థల వివాదం

చెవి కొరికిన వైనం


ఘర్షణలో గాయాలైన సురేష్ చెవి

ప్రజాశక్తి - బాలాయపల్లి : పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లు పెట్టు కునే స్థలానికి సంబంధిన వివాదం చిలికి చిలికి గాలివాన కావడంతో పోలీసులు కేసును బుధవారం నమోదు చేసిన సంఘటన మండలంలోని జయంపు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు ..బొచ్చు సుమన్ అవ్వ, బట్టే పాటి రామయ్య అవ్వలు గత కొంత కాలంగా తోపుడు బండ్లపై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే క్రమంలో గత రెండు రోజులు క్రితం బండ్లు పెట్టు కునే స్థలం వద్ద వివాదం మొదలైంది. ఇద్దరు మనవళ్లు కయ్యానికి దిగారు, రామయ్య, సురేష్‌లు మధ్య మాటా మాటా పెరిగి గొడవకి దారి తీసింది. రామయ్య, సురేష్ చెవి కొరకడంతో తీవ్ర గాయం అయ్యింది. చికిత్స కోసం ఆసుపత్రకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ మమహాబుబ్ సుభాన్ తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలోని జెండా మాను వీధిలోని కృష్ణా నిలయం అపార్టుమెంటులో పార్క్ చేసిన లక్ష రూపాయలు విలువ చేసే (యమహా ఆర్‌ఎక్స్ 100) ద్విచక్ర వాహనాన్ని బుధవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు అపహ రించారు. దీంతో వాహన యజమాని లబోదిబోమని పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణం లో పెరుగుతున్న వాహన చోరీలను అరికట్టాలని ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసులు స్పందించాల్సి వుంది.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం..

ప్రజాశక్తి - ఓజిలి : మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి పిలుపు నిచ్చారు. మండలలోని పెద్దపరియ ఆరోగ్యం కేంద్ర పరిధిలోని ఆరిమేనిపాడు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ లో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనతతో పిల్లల, గర్భవతుల, బాలింతల మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఆరోగ్యశాఖ సిబ్బంది పని చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో రక్తహీనత ఉన్న పిల్లలు, గర్భవతులను గుర్తించి వారికి తగు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్య పెంచడంతో పాటు ఆసుపత్రికి వచ్చే గర్భిణు లకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసు కోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్ర మంలో డీఎస్‌ఓ నాగేంద్ర కుమార్ , డిపిఓ ఎన్ హెచ్ ఎం. ప్రకాష్, డాక్టర్ మాధవ్ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసులు

తపస్య స్కూలులో అంతర్జాతీయ కరాటే పోటీలు

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని, బషీర్స్ తపస్య స్కూలులో అంతర్జాతీయ గోజు -ర్యు కరాటే పోటీలు బుధవా రం నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్య అధినేత విక్రమ్ శాలీ మాట్లాడుతూ బుధవారం తపస్య స్కూల్‌లో గ్రాండ్ మాస్టర్ ఆర్ సుందరం మూర్తి మాస్టర్, దేవరాజు మాస్టర్, ఆనంద్ మాస్టర్ , ముకుంద మాస్టర్‌ల ఆధ్వర్యంలో అంతర్జా తీయ గోజు -ర్యు (ఎల్లో బెల్ట్ ఆరెంజ్ బెల్ట్) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తొమ్మిది మంది ఆరెంజ్ బెల్ట్‌ను, ఎనిమిది మంది ఎల్లో బెల్ట్ ను కైవసం చేసుకు న్నారు. ఇలా కరాటే పోటీలు తపస్య స్కూలులో నిర్వహించడం రెండవసారి అని, గతంలో ఎల్లో బెల్ట్‌ను నిర్వహించామని తెలిపారు. అంచెలంచెలుగా ముందు కు వెళుతున్న తపస్య విద్యార్థులను కరాటే మాస్టర్లు, తపస్య డైరెక్టర్ కె అనూష అభినందించారు.



అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు